సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం। 17। ఫిబ్రవరి। 2024



గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

మదనపల్లె పట్టణంలో మొలలు, ఫిస్టులా వ్యాధులకు చికిత్సలు అందించే ఓ వైద్యుడు అక్రమంగా గంజాయి తీసుకువస్తుండగా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. -IIలో



కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధి వస్తున్న నేపథ్యంలో కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్థశాఖ అధికారి శారదమ్మ చెప్పారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.172
రెండోరకం	రూ.80	రూ.118

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 102 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	472
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1019.880 కిలోలు

న్యూస్‌రీల్

17న డయల్ యువర్ 'డీపీటీఓ'

రాయచోటి అర్బన్: ఈనెల 17వతేదిన డయల్ యువర్ డీపీటీఓ (జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా డీపీటీఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి బస్టాండు పై భాగంలోని ఆర్టీసి జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రయాణికులు, తమ సలహాలు,సూచనలు,సమస్యలను 8985283211 నంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: రహదారులు, భవనాల శాఖలో ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో 26 ఉద్యోగాలు ఉన్నట్లు తెలిపారు. వీటిలో వాచ్‌మెన్–8, శానిటరీ వర్కర్స్–8, అటెండర్–10 ఉన్నాయన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను annamayya.ap.gov.in వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌కు దగ్గర.. సబ్ రిజిస్టర్ కార్యాలయం వెనుక ఉన్న భవనాల ఇంజినీరింగ్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

22న పాస్టర్ల సదస్సు

కురబలకోట: రాయచోటిలోని ఇక్తూస్ కొత్త చర్చిలో ఈనెల 22న దైవ సేవకుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆహ్వానితులు పాస్టర్ అంజల బాబు, దివ్య శుక్రవారం తెలిపారు. బ్రేక్ త్రూ పాస్టర్స్ ఫెలోషిప్ ఆద్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. అన్నమయ్య జిల్లా పాస్టర్స్ పెలోషిప్, రాయచోటి పాస్టర్స్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపోస్తలిక్ కర్నూలుకు చెందిన సాలొమోను,గ్రేస్ వాక్యోపదేశం చేస్తారన్నారు.

జీవన ప్రమాణాల మెరుగుకు దోహదం



సర్టిఫికెట్లు పొందిన వారితో అధికారులు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో పొందిన శిక్షణలు వారి జీవన ప్రమాణాలు మెరుగుకు దోహదపడతాయని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలరింగ్ శిక్షణ నిర్వహించారు. శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అసెస్మెంట్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ శిక్షణ పొందిన యువతీ యువకులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, కో–ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, మహమ్మద్ ఆరీఫ్, గణేష్‌లు పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

- దేవునికడప జనసంద్రం
- భక్తుల జయజయధ్వానాల మధ్య కదిలిన కడపరాయుని రథం



దేవుని కడపలోని తిరుమాడవీధిలో భక్త జనం మధ్య స్వామివారి రథం (ఇన్‌సెట్) దేవేరులతో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి

కడప కల్చరల్: ఇసుకేస్తే రాలనంత జనం మధ్య కడప రాయుని రథం కదిలింది. బ్రహ్మదేవుడు సారథ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వతేజోమూర్తి సూర్యుని సాక్షిగా మహా మేరు పర్వతంలా జనసంద్రం మధ్యన సాగింది. భక్తులు రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని జయజయధ్వానాలు చేస్తూ జన్మధన్యమైందని మైమరచిపోయారు. కడప రాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించారు. మాడ వీధులన్నీ జనంతో నిండిపోగా మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు రథంలోని దేవదేవుడిని తిలకించి పులకించారు.

కట్టలు తెగిన ఉత్సాహం

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని ఉదయం రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు దర్శనాల కోసం భక్తులు బారులు తీరి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం సరిగ్గా 2.40 గంటలకు ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు తొలి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాతకడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు.

ముందువైపు అశేష జనసందోహం పోటీలుపడి గొలుసులతో రథాన్ని లాగుతుండగా, మొక్కులు గల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడి కాయలను ఉంచి ఆ ముక్కలను ప్రసాదంగా స్వీకరించారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. రథంపై నుంచి యువతను ప్రోత్సహిస్తూ రథోత్సవం సక్రమంగా సాగేందుకు సూచనలిచ్చారు. భక్తుల గోవిందనామ స్మరణలతో దాదాపు నాలుగు గంటలపాటు దేవునికడప మార్మోగింది. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య సాయంత్రం 6.20 గంటలకు రథాన్ని ముందున్న చోటులో చేర్చారు. రాత్రి ధూళి ఉత్సవం నిర్వహించారు.

నేటి అలంకారాలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంపై మాడవీధుల్లో ఊరేగించనున్నారు. రాత్రి అశ్వవాహనంపై దేవదేవుడు కరుణించనున్నాడు.

డిప్యూటీ సీఎం పూజలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక నాయకులు జరుగు రాజశేఖర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు, సభ్యులతో కలిసి రథంపైకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీ పద్మావతి మాతను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు, వేదాశీస్సులు అందజేశారు.



రథంలోని స్వామిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఈక్రాప్ తప్పనిసరిగా చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ చంద్ర నాయక్

లక్కిరెడ్డిపల్లి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన ఆ పంటలకు ఈక్రాప్ తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు చంద్ర నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, వీరబల్లి మండలాలలకు చెందిన రైతు భరోసా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, దీనివల్ల పీఎం కిసాన్ పథకం కింద రూ. 2 వేలు రైతుల ఖాతాలలో జమ అవుతుందన్నారు. ఈనెల 21వ తేదీలోపు ఈక్రాప్, ఈకేవైసీ తప్పకుండా చేయించాలన్నారు. రైతులకు విత్తనాలు,ఎరువులు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, ఏఓ రమేష్ బాబు రావు, ఏఈఓలు కెరోలిన్, అనూష, ఈఏ చాంద్ బాష, నాలుగు మండలాల రైతు భరోసా కేంద్రాల క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 28 మందిలో 24 మంది నియామక పత్రాలను పొందారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం నియామకాలను చేపట్టినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు త్వరగా పంపిణీ చేయాలి

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీసర్వేమూడోదశ, ఇనామ్ అండ్ అసైన్డ్ భూములు, ఉపాధి హామీ, కరువు మండలాల్లో వేతన ఉత్పత్తి..తాగునీరు సరఫరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమాలను పటిష్టవంతంగా నిర్వహించి ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కంటి వెలుగు పథకంలో భాగంగా రెఫరల్ చేసిన వారికి అద్దాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలన్నారు.



ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రెవెన్యూ అంశంలో భాగంగా చుక్కల భూములు, ఇనామ్ భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించలన్నారు. జిల్లాలో మూడో దశ రీసర్వేలో సుమారు 20 వేలకు పైగా ఎకరాలు సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అంశంలో భాగంగా ప్రతి సచివాలయంలో రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పంచాయతీ సెక్రటరీలు రిజిస్ట్రేషన్ పటిష్టంగా నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా అంశంపై సీపీడబ్ల్యూ పథకం అమలులో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని కలెక్టర్ సూచించారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా ఎస్పీ బి కృష్ణారావులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో, ఎస్పీలతో సార్వత్రిక ఎన్నికలు–2024కు సంసిద్ధతపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు ఎన్నికల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవ్వాలని, వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



మహిళలకు చెక్కును అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఎంపీ మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగుతోందని, ప్రతి మహిళకు ఆర్థిక భరోసా అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత చెక్కులను మహిళలకు అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.29,56,98,000లు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కోడూరు నియోజకవర్గం చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య ఎలా ఉంది, జగనన్న పరిపాలనలో నేడు ఎలా ఉందో ఆలోచించాలన్నారు. మహిళల కష్టంతోనే కుటుంబాలు ఆధారపడి ఉంటాయని గుర్తించి ప్రతి పథకం వారికి అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. 2014లో చంద్రబాబు మేనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, బంగారు రుణాల మాఫీ అంటూ హామీలిచ్చారని, అవి అమలైన దాఖలాలు లేవన్నారు. జగనన్న చెప్పిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు అన్యాయం చేస్తే జగనన్న వచ్చాక ఎటువంటి మధ్యవర్తులు, లంచాలు లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారులకే చేరాయన్నారు. పేద కుటుంబాలు బాగుపడాలంటే జగనన్నను ఆదరించాలన్నారు. పథకాలు ఉండాలంటే జగనన్న ఉండాలని, నక్కజిత్తుల బాబును నమ్మరాదన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ జగనన్న పథకాలతో ప్రతి పేద కుటుంబం బాగుపడుతోందని అన్నారు. గత ప్రభుత్వం మహిళలను మోసం చేస్తే జగనన్న సీఎం అయ్యాక నవరత్నాలతోపాటు ఎన్నో పథకాలు అమలు చేసి మహిళలకు, అవ్వా, తాతలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. ఎన్నికలలో డప్పులు కొట్టుకుంటూ కొందరు వస్తారని, వారిని నమ్మరాదన్నారు. నాడు రూ.49 వేల డ్వాక్రా గ్రూపులు ఉండగా నేడు జగనన్న పాలనలో 1.20 కోట్లు గ్రూపులు ఉన్నాయని తెలిపారు. నాడు బాబు డ్వాక్రా గ్రూపులు నిర్వీర్యం చేస్తే నేడు అదే మహిళలకు సీఎం వైఎస్ జగన్ అండగా ఉంటూ ఆదుకుంటున్నారని తెలిపారు. కోడూరు నియోజకవర్గంలో 20 వేల ఇళ్లు ఇచ్చిన ఘనత తమదే అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి సహకారంతో రూ. 50 కోట్లతో ప్రొటెక్షన్ వాల్, హైలెవెల్ బ్రిడ్జీలు, రైల్వే అండర్ బ్రిడ్జి, 50 పడకల ఆసుపత్రి, తాగునీటి సమస్య, రూ. 2300 కోట్లతో బైపాస్ హైవే ఇలా ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గంలో 2 లక్షల మంది ఓట్లు ఉంటే లక్ష మంది మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్ తోక పార్టీలు కౌరవుల రూపంలో వస్తారని, 50 రోజులు జరిగే కురుక్షేత్రంలో జగనన్న అర్జునుడిలా విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

కొరముట్ల శ్రీనివాసులు, నన్ను ఆశీర్వదించండి

నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టి, అర్హులకు సంక్షేమపథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో నన్ను, కొరముట్ల శ్రీనివాసులను ఆశీర్వదించాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. మనమంతా జగనన్న వెంట నడవాలని తెలిపారు. సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, హేమనవర్మ, పంజం సుకుమార్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, తోట శివసాయి, సాయికిషోర్ రెడ్డి, సీహెచ్ రమేష్, నాగేంద్ర, ముజీబ్, సీడీ నాగేంద్ర, ఎం సుబ్బరామరాజు, ప్రశాంతి, ఎల్‌వి మోహన్ రెడ్డి, రత్నమ్మ, అన్వర్‌బాషా, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 పడకల ఆసుపత్రి ప్రారంభం

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన 50 పడకల ఆసుపత్రిని ఎంపీ మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. అలాగే చిట్వేలి రోడ్డులో అధునాతనంగా వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన బస్ షెల్టర్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతి మండలంలో ఆసుపత్రులను అభివృద్ధి చేశారని అన్నారు.

పేదలకు కార్పొరేట్ విద్య

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం
- విద్యా హక్కు చట్టం కింద ఒకటో తరగతిలో ప్రవేశాలు



పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేయడం కాకుండా వచ్చే ఏడాదికి సంబంధించి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంలా మారనుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ప్రవేశాలు కల్పించేందుకు నిరాకరించే యజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటారు.


పక్కాగా అమలు

ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022–23 విద్యా సంవత్సతరంలో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేశారు. జిల్లాలో 30 మండలాల పరిధిలో ప్రవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల నుంచి 741 మందిని అర్హులుగా గుర్తించి లాటరీ ద్వారా వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. ఎంపికైన వారు ఆయా మండలాల్లోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించారు. అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్ నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర విద్యాశాఖ డీఈవోల ద్వారా ఆయా పాఠశాలలకు పంపించింది. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశారు.

2024–25 విద్యా సంవత్సరానికి....

విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక పాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులకు ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ఐబీ/ ఐసీఎస్‌ఈ/ సీబీఎస్‌ఈ/ స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల నుంచి ఈనెల 6వతేదీ నుంచి సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాల్సిందిగా కమిషనర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక వరంగా చెప్పవచ్చు. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటతో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి.

-శ్రీరాం పురుషోత్తం, డివైఈఓ,మదనపల్లె

షెడ్యూలు ఇలా..

- ఈనెల 20వతేదీ వరకు సీఎస్‌ఈ. ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టర్‌లో ఐబీ, ఐఈఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అమలయ్యే ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్
- 23 నుంచి మార్చి 14 వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్
- మార్చి 20 నుంచి 22 వరకు స్టూడెంట్ అప్లికేషన్ ఎలిజిబిలిటి డిటర్మినేషన్ త్రూ జీఎస్‌డబ్ల్యూ డేటా
- ఏప్రిల్ 1న లాటరీ ద్వారా మొదటి విడత జాబితా ప్రచురణ
- ఏప్రిల్ 2 నుంచి 10 వరకు ఆయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ
- ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో విడత జాబిత ప్రచురణ
- ఏప్రిల్ 16 నుంచి 23వ వరకు ఆయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ

శాస్త్రోక్తంగా రథసప్తమి వేడుకలు




ఒంటిమిట్ట పురవీధులలో ఊరేగుతున్న కోదండరాముడు, నందలూరులో సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు



రాయచోటిలో స్వామికి సమర్పించిన నైవేద్యంలో నుంచి సూర్యభగవానుడి ప్రతిబింబ దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు.

సూర్య, చంద్రప్రభ వాహంపై సౌమ్యనాథుడు

నందలూరు(రాజంపేట) : ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయానికి శుక్రవారం రథసప్తమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సౌమ్యనాథస్వామి ఉదయం కుర్మాలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడా వీధులలో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శ్రీకృష్ణ భగవానుని అలంకారంలో చంద్రప్రభ వాహనంపై మాడా వీధులలో విహరించారు.

శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో..

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో సూర్యుడికి పూజలు నిర్వహించి ఒక పాత్రలో స్వామి వారికి వండిన నైవేద్యంపై నెయ్యి పోసి అందులో నుంచి సూర్యభగవానుడిని ప్రతిబింబాన్ని చూసి సమస్కారాలు చేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

మదనపల్లె : ఆపద సమయాల్లో ఆపద్బాంధవుడిలా ప్రాణాలు నిలిపే 108 అంబులెన్స్‌లో ఓ తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన శుక్రవారం జరిగింది. పుంగనూరు నియోజకవర్గం దిగువపల్లె పంచాయతీ మఠ్రిమాకులపల్లెకు చెందిన మహబూబ్‌బాషా భార్య సబీనా(26) నిండుచూలాలు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సబీనాకు పురిటినొప్పులు అధికమవడంతో భర్త మహబూబ్‌బాషా 108కు ఫోన్ చేశాడు. 108 వాహనం మఠ్రిమాకులపల్లెకు వెళ్లి సబీనాను వాహనంలోకి ఎక్కించుకుని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వస్తుండగా, మార్గంమధ్యలో ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. 108 అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేశారు. రెండో కాన్పులో సబీనా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, తదుపరి వైద్యసేవల నిమిత్తం ఇరువురినీ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సుఖప్రసవం చేసిన 108 అంబులెన్స్ సిబ్బంది ఐ.రెడ్డిజశ్వంత్, పైలట్ ఏ.ఎస్.సద్దాంలను సబీనా కుటుంబ సభ్యులు అభినందించారు.



మగబిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

గంజాయి అక్రమ రవాణాలో ఒకరి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో మొలలు, ఫిస్టులా వ్యాధులకు చికిత్సలు అందించే ఓ వైద్యుడు అక్రమంగా గంజాయి తీసుకువస్తుండగా టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ జి.యువరాజు తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ యువరాజు మాట్లాడుతూ... ముందుగా వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం మధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ దాస్(28) గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. విచారణలో నిందితుడు రాహుల్‌దాస్ పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో అభయక్లినిక్ పేరుతో రెండేళ్లుగా మొలలు, ఫిస్టులా వ్యాధులకు చికిత్సలు అందించే డాక్టర్‌నని చెప్పాడన్నారు. తనకు గంజాయి తాగే అలవాటు ఉండటంతో సొంత రాష్ట్రానికి వెళ్లినప్పుడల్లా గంజాయి తెచ్చుకునే వాడనని, అందులో భాగంగా శుక్రవారం స్వగ్రామం నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు చెప్పాడు. దీంతో రాహుల్ దాస్ నుంచి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారన్నారు. మదనపల్లె పట్టణ పరిధిలో గంజాయి, లిక్కర్, సారా, బెట్టింగ్, జూదాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు మదనపల్లె టూటౌన్ సీఐ...9491074519, ఎస్ఐ..9440796741 నెంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.



గంజాయి, నిందితుడి అరెస్ట్ చూపుతున్న టూటౌన్ సీఐ, ఎస్ఐ, పోలీసులు

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

తంబళ్లపల్లె : అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో వెలుగు చూసింది. పోలీసులు, మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు.. కోటకొండకు చెందిన అంజనప్ప, రెడ్డెమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె స్వాతి(15) తొమ్మిదో తరగతి చదివి బడిమానేసి ఇంటి వద్ద ఉంటోంది. తండ్రి అంజనప్ప గంగమ్మ విగ్రహాన్ని ఊరూరా తిప్పుతూ భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున కుమార్తె కనిపించకపోవడాన్ని తల్లి గుర్తించి గ్రామస్తుల సహకారంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ కనపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె సెల్‌ఫోన్ లొకేషన్ గ్రామ సమీపంలోని చెరువులో ఉన్నట్లు గుర్తించారు. గురువారం సాయంత్రం చెరువు వద్ద వెతుకుతుండగా ఆమె చెప్పులు, సెల్‌ఫోన్‌ను గుర్తించారు. కొంత దూరంలో శవం తెలియాడుతుండగా పోలీసులు గ్రామస్తుల సహకారంతో బయటకు తీశారు. ఆమె శరీరంపై చేతితో కొట్టిన గాయాలు గుర్తించి అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బాలిక మృతదేహం

వివాదాస్పదంగా దేవదాయ శాఖ ఈఓ వ్యవహారం

గోపవరం : బద్వేలు దేవదాయ శాఖ ఈఓ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ రెడ్డిపల్లె గోవిందరెడ్డి, ఈఓ శివయ్య మధ్య గత కొన్ని నెలలుగా వివాదం చోటు చేసుకుంది. ఆలయానికి సంబంధించిన నిర్ణయాలను చైర్మన్‌కు తెలియకుండానే ఈఓ తీసుకుంటుండటంతో వివాదం మరింత పెద్దదైంది. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 2022 నవంబర్ 11 నుంచి 2023 నవంబర్ 17 వరకు డ్రా చేసిన సుమారు రూ.18 లక్షలకు సంబంధించి ఎలాంటి లెక్కలు చూపలేదని చైర్మన్ ఈఓను ప్రశ్నించారు. మల్లెంకొండేశ్వరస్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు ఈ నెల 5వ తేదీన దేవదాయశాఖ కార్యాలయంలో వేలం పాట నిర్వహించినా.. తనకు సమాచారం ఇవ్వలేదని చైర్మన్ ఆరోపిస్తున్నారు. అలాగే రెండవ విడత 15వ తేదీన నిర్వహించిన వేలంలో రూ.3.82 లక్షలు పాటదారుడు పాడినా.. మళ్లీ వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటని ఈఓను చైర్మన్ ప్రశ్నించారు. గత ఏడాది నిర్వహించిన శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి కూడా ఈఓ పాలక మండలికి సహకరించలేదని ఆరోపించారు. బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.18 లక్షలకు సంబంధించి ఖర్చు చెప్పాలని శుక్రవారం ఈఓను చైర్మన్ నిలదీశారు. ఈఓ పొంతన లేని సమాధానం చెప్పడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. మార్చి 8న శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొండపైన, కొండ దిగువన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. దేవదాయశాఖ, పాలకమండలి సమన్వయంతోనే బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఈఓ, చైర్మన్ మధ్య వివాదం కొనసాగుతుండటంతో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. చైర్మన్ చేసిన ఆరోపణలపై ఈఓ శివయ్యను సాక్షి వివరణ కోరగా డ్రా చేసిన నగదుకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, కావాలనే చైర్మన్ తనపై రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. తలనీలాల సేకరణకు నిర్వహించిన రెండు దఫాల వేలంపాటలో కూడా సరైన ధర పలకకపోవడంతో వాయిదా వేయడం జరిగిందని, మరోమారు వేలంపాట నిర్వహించి హెచ్చు పాటదారుడికి తలనీలాల సేకరణను అప్పగిస్తామన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగేందుకు ఆస్కారం ఉండదని ఈఓ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



సుహేల్(ఫైల్)

మొలకలచెరువు : ఒక విద్యార్థి అదృశ్యమైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై తిప్పే స్వామి కథనం మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం బొంతలపల్లికి చెందిన మహమ్మద్ రఫీ కుమారుడు మహమ్మద్ సోహెల్(12) స్థానికంగా ఒక ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వచ్చిన సుహేల్ రాత్రి గడిచినా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా సమాచారం దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్సై తిప్పే స్వామి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోటపాలెంలో దొంగ హల్‌చల్

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని గాంధీనగర్‌లో శుక్రవారం వేకువజామున దొంగ చోరీ ప్రయత్నం చేసిన సంఘటన చోటు చేసుకుంది. భవన నిర్మాణ పనులకు మేస్త్రిగా వ్యవహరిస్తున్న మహబూబ్ బాషా ఇంటిలోకి ఓ దొంగ చొరబడ్డాడు. మహబూబ్ బాషా కుమారుడు అబ్దుల్లా వేకువజామున రెండు గంటల 15 నిమిషాలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి వరండాలోని మరుగుదొడ్డికి వచ్చి.. తిరిగి ఇంటిలోకి వెళ్లే సమయంలో అలికిడి రావడంతో గమనించిన అపరిచిత వ్యక్తి ఇంటి వరండాలో తారస పడడంతో.. గట్టిగా అరచి పట్టుకునే ప్రయత్నం చేశాడు. దీంతో తండ్రి మహబూబ్ బాషా పరుగున బయటకు వచ్చి గుర్తు తెలియని వ్యక్తి తన కొడుకుతో కలబడడం చూసి తాను అడ్డుకునే ప్రయత్నం చేయగా గుర్తు తెలియని వ్యక్తి కొడుకు, తండ్రి ఇద్దరినీ నెట్టి పారిపోయాడు. ఈ పెనుగులాటలో దొంగ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, సెల్‌ఫోన్, చెప్పులు సంఘటనా స్థలంలోనే వదిలేశాడు. అరుపులకు చుట్టు పక్కలవారు లేచి అగంతకుడి కోసం వెతికే ప్రయత్నం చేశారు. దొంగతగానికి ప్రయత్నించిన వ్యక్తి చుట్టు పక్కల కనిపించకపోవడంతో వెంటనే బాధితులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకొని విషయం తెలుసుకొని పరిసరాలను పరిశీలించి సెల్‌ఫోన్ స్వాధీన పరుచుకున్నట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటనతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు.

కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి



జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్ : నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలో కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారితమైందని, కావున వైఎస్ఆర్ జిల్లాలోని కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. స్థానికంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ కోళ్ల పెంపకందారులు ఈ వ్యాధి గురించి చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవిస్తే స్థానిక పశు వైద్యాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని తెలిపారు. జిల్లాలో ఉన్న పశువైద్యులందరికీ బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణను కూడా ఇచ్చామన్నారు. ఈ వ్యాధి కోళ్లకు సోకి కోళ్ల నుంచి మనుషులలో ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలను కలుగ చేస్తుందన్నారు. కావున కోళ్లఫారం యజమానులు, కోళ్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పక్క జిల్లా అయిన నెల్లూరు జిల్లా నుంచి కోళ్లను కొనుగోలు చేయడం గానీ కోళ్ల దాణాను కొనుగోలు చేయడం కానీ నిషేధించడం జరిగిందన్నారు. అందరూ ఇది గమనించి జాగ్రత్తగా ఉండావలసిందిగా తెలియజేశారు. బద్వేల్ పట్టణంలోని పలు కోళ్ల ఫారాలను పశు వైద్యసిబ్బంది సందర్శించి వ్యాధి నిర్ధారణ కోసం తీసకోవాల్సిన జాగ్రత్తలకు రైతులకు తెలియజేశారన్నారు. సరిహద్దు ప్రాంతాలైన నెల్లూరు జిల్లాకు చెందిన పిపి కుంట, ప్రకాశం జిల్లా సమీపంలోని పోరుమామిళ్ల ప్రాంతాలలో కోళ్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- మైలవరం మండలంలో 600 కుటుంబాలకు పార్టీ తీర్థం
- పలు గ్రామాల్లో పర్యటించిన రీజనల్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి ప్రచారం



సురేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పీఆర్ వర్గీయులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఊపందుకున్నాయి. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు శుక్రవారం మైలవరం మండలంలో విస్తృతంగా పర్యటించారు. నవాబుపేట, దుగ్గనపల్లె, గొల్లపల్లె, వద్దిరాల, దొడియం, నక్కవానిపల్లె, బుచ్చంపల్లె, బోగాలకట్ట, బొగ్గులపల్లె, దొమ్మరనంద్యాల, గంగులనారాయణపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మైలవరం మండలంలోని పలు గ్రామాల నుంచి 600 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పలు గ్రామాల్లో సుధీర్‌రెడ్డి వర్గం, రామసుబ్బారెడ్డి వర్గం అని ఉండేవని, ఇప్పటి నుంచి ఆ రెండు వర్గాలు కలిసి వైఎస్సార్ వర్గంగా పని చేస్తాయని పేర్కొన్నారు. రాబోయే రెండు నెలలు ప్రతి కార్యకర్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేయాలని తెలిపారు. కాగా సురేష్‌బాబు వెంట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కలిసి తిరగడంతో పార్టీ వర్గాల్లో జోష్ కనిపించింది. ఇరువురు నాయకులు కలసి పల్లె పల్లె తిరుగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునివ్వడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. కాగా మూడేళ్ల క్రితం రామసుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరినప్పుడే.. చాలా గ్రామాల్లోని ఆయన అనుచర వర్గం వైఎస్సార్‌సీపీలోకి వచ్చింది. అయితే అక్కడక్కడా కొందరు నేతలు పార్టీలోకి చేరకుండా స్తబ్దుగా ఉన్నారు. ప్రస్తుతం వీరందరినీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డికి పరిచయం చేసి వందలాది కుటుంబాలను సురేష్‌బాబు పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ లక్షుమయ్య యాదవ్, కల్లుట్ల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామయ్య, మాజీ సర్పంచ్ రమణయ్య, శివశంకర్‌రెడ్డి, తొర్రివేముల గురివిరెడ్డి, పుల్లారెడ్డి, శెట్టిపల్లె శంకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, విజయుడు, హుస్సేన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, టీబీహెచ్ ఎల్సీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, చేరెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంపలాకు రామాంజనేయ యాదవ్, నారపురెడ్డి జగదీశ్వరరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, మిలటరీ గుర్విరెడ్డి, దొంతిరెడ్డి నారాయణరెడ్డి, యనమల పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతి



మృతి చెందిన అనసూయిమ్మ

మదనపల్లె : మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 12న పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన కృష్ణ భార్య అనసూయమ్మ(66) అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ నెల 12న మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో ఇంట్లో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ.. నాలుగు రోజుల తర్వాత శుక్రవారం మరణించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన రెడ్డిఅజయ్

రామసముద్రం : ట్రాక్టరు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన రామసముద్రం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పినెల్లి గ్రామానికి చెందిన వీరప్ప, శ్యామలమ్మ కుమారుడు రెడ్డి అజయ్(18) ద్విచక్రవాహనంలో కుదురుచీమనపల్లె నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ముందు భాగంలో మినికి పంచాయతీ గుంతవారిపల్లె గ్రామానికి చెందిన మనోహర్ మడకలు వేసుకుని ట్రాక్టర్‌తో వెళ్తున్నాడు. రెడ్డి అజయ్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఛాతిపై తీవ్ర గాయమైంది. యువకుడిని హుటాహుటిన కుటుంబీకులు, స్థానికులు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే యువకుడు మృతి చెందాడు. మృతుడు ఇంటర్మీడియట్ వరకు చదువుకొని ఇంటిపట్టునే తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటు కూలీ పని చేసుకుంటూ ఉండేవాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఉప్పినెల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవశకం

ఉచితంగానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అన్నీ కూడా ఉచితంగా తీసుకోవడం జరిగింది. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకునే వాళ్లం. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణపత్రాలు అన్నీ కూడా ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణపత్రాలు వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాం. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తుండటంతో మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– బాదిరెడ్డి రత్నమ్మ,
కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మఒడితో ఆసరా



మాది కాశినాయన మండలం ఆకులనారాయణపల్లె గ్రామం. నా భర్త హరిబాబు మగ్గం నేస్తుంటాడు. అది కూడా సక్రమంగా జరగడం లేదు. మాకు ఇద్దరు పిల్లలు. మా కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. కుమారుడు 4వ తరగతి చదువుతున్నాడు. నేను కూలీ పనికి వెళుతుంటాను. మా ఇద్దరి సంపాదనతోనే మా కుటుంబం గడవాలి. పిల్లల పోషణ, ఇద్దరి పిల్లలను చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు బ్యాంకు ఖాతాలో వేసి మమ్మల్ని ఆదుకుంటున్నారు. కుమార్తె చదువుకు ఆసరాగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం వలన పిల్లలను బాగా చదివించుకుంటున్నాము. ఇప్పటికి మాకు మూడు విడతలు అమ్మఒడి అందింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– రెబ్బారమాదేవి,
ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

ఇల్లు మంజూరైంది



రోజూ కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. కనీసం సెంటు స్థలం కూడా లేదు. అత్తా, మామలు అంతా ఒకే ఇంట్లో ఇరుకుగా ఉంటున్నాము. గత ప్రభుత్వంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం పలుమార్లు అర్జీలు పెట్టుకున్నాను. జన్మభూమి కమిటీవారు అర్జీని తీసేస్తూ వచ్చారు. ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగ కుండానే నాకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరైయింది. ఇప్పుడు నేను వంతాటిపల్లి గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు కూడా సొంత ఇండ్లనేది ఉంది.

– ఉన్నం రెడ్డెమ్మ,
వంతాటిపల్లి, సిద్ధవటం మండలం

నాటు సారా స్వాధీనం

మదనపల్లె : పట్టణంలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పుంగనూరురోడ్డు బసినికొండ మారెమ్మగుడివీధిలో దేవి అనే మహిళ నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో.. దాడులు నిర్వహించి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే ప్రాంతానికి చెందిన బి.చంద్రశేఖర్‌నాయక్ నుంచి సుమారు 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చింతకాయల కోసం వెళ్లిన మహిళపై దాడి



గాయపడిన ధనలక్ష్మి

మొలకలచెరువు : చింతకాయల కోసం వెళ్లిన మహిళను ఓ వ్యక్తి కర్రతో తీవ్రంగా కొట్టి గాయపరచిన ఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. ఘటనకు సంబంధించి బాధితురాలు ములకలచెరువు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు... మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ ఎర్రంరెడ్డి గారి పల్లెకు చెందిన వెంకటరమణ భార్య ధనలక్ష్మి(28) దాసిరెడ్డిగారిపల్లెకు చెందిన తులసిరెడ్డి పొలంలోని చింతచెట్ల కింద గాలికి రాలిన చింత కాయలను ఏరుకోవడానికి వెళ్లింది. తులసిరెడ్డి అడ్డుకొని తన తోటలో కాయలు ఏరడానికి లేదని గొడవపడ్డాడు. గాలికి రాలిన కాయలు ఏరుకుంటున్నానని చెప్పడంతో.. ఆగ్రహించి పక్కనే ఉన్న కర్రతో విచక్షణ రహితంగా ధనలక్ష్మిపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె చేయి విరిగి తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు బాధితురాలిని వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సల అనంతరం ములకలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఎస్ఐ నజీర్‌బాషా నిందితుడు తులసిరెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.